క్లుప్తంగా

అలరించిన కళాఉత్సవ్



నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని బాల్ భవన్‌లో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి కళాఉత్సవ్ పోటీలు అలరించాయి. రెండో రోజైన గురువారం నిర్వహించిన కార్యక్రమానికి డీఈవో హాజరై మాట్లాడారు. విద్యార్థులు తమలోని కళలను ప్రదర్శించుకునేందుకు ఈ వేదిక చక్కగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 9, 10, 11, 12 తరగతుల విద్యార్థులు హాజరయ్యారు. డ్రెస్, ట్రెడిషనల్ స్టోరీ టెల్లింగ్, థియేటర్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో జీవన్ మాట్లాడుతూ.. పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన వారు రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్తారని పేర్కొన్నారు. పలువురు విద్యార్థినులు నృత్యాలు చేశారు. కార్యక్రమంలో బాల్‌భవన్ సూపరింటెండెంట్ ప్రభాకర్, వివిధ పాఠశాలల గైడ్ టీచర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని నకాష్‌గల్లీలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను డీఈవో దుర్గాప్రసాద్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యా బోధనను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. డీఈవో వెంట ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

ఈనెల 21న ధ్రువపత్రాల పరిశీలన

నిజామాబాద్ అర్బన్: డీఈడీ, డీపీఎస్ఈ కోర్సుల్లో అడ్మిషన్ల కోసం గతంలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరుకాని అభ్యర్థులు ఈనెల 21న హాజరుకావాలని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో సూచించారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తయిన అభ్యర్థులు 23 నుంచి 26వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ పెట్టుకోవాలని సూచించారు.అనంతరం ఈనెల 30 నుంచి నవంబర్ 3వ తేదీ వరకు అలాట్‌మెంట్ లెటర్‌ను డౌన్‌లోడ్ చేసుకొని తమకు కేటాయించిన కళాశాలలో చేరాలని పేర్కొన్నారు.

హైకోర్టు ఉత్తర్వులు అమలు చేయాలి



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ విశ్వవిద్యాలయంలో 2014లో నియమితులైన అధ్యాపకులకు రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులను తక్షణమే అమలు పరుస్తూ పదోన్నతులు కల్పించాలని తెలంగాణ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (టూటా) అధ్యక్షుడు ఏ.పున్నయ్య డిమాండ్ చేశారు. హైకోర్టు ఉత్తర్వులు వెంటనే అమలు చేయాలని కోరుతూ టూటా ఆధ్వర్యంలో తెయూ పరిపాలనా భవనం ఎదుట గురువారం అధ్యాపకులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు పున్నయ్య, కోశాధికారి ఏ నాగరాజు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉత్తర్వులు అందిన వెంటనే పదోన్నతుల ప్రక్రియను మొదలుపెడతామని హై కోర్టులో చెప్పిన రిజిస్ట్రార్, నేటికీ ఆ దిశగా నిర్ణయం తీసుకోకపోవడం శోచనీయమన్నారు. అనంతరం రిజిస్ట్రార్ యాదగిరికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎం సత్యనారాయణరెడ్డి, రాజేశ్వరి, బాలకిషన్, నీలిమ, జమీల్ అహ్మద్, ప్రసన్నశీల, వాసం చంద్రశేఖర్, స్వప్న, మహేందర్, స్రవంతి, రమణాచారి, కిరణ్మయి, సమత పాల్గొన్నారు.

తక్షణమే డీఏలు ప్రకటించాలి

నిజామాబాద్ అర్బన్: పెండింగ్‌లో ఉన్న డీఏలను తక్షణమే ప్రకటించాలని స్టేట్ టీచర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ధర్మేందర్, చీమల శ్రీకాంత్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 2022 నుంచి ఇప్పటి వరకు రావాల్సిన 5 డీఏలలో తక్షణమే 4 డీఏలను ఈనెల 23న నిర్వహించే కేబినెట్ మీటింగ్‌లో ప్రకటించాలన్నారు. ఇప్పటికే ఉద్యోగులు చాలా నష్టపోతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

విలీన మహాసభ పోస్టర్ల ఆవిష్కరణ

మోపాల్: హైదరాబాద్‌లో ఈనెల 20న నిర్వహించే టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీన సభ పోస్టర్లను నాయకులు గురువారం మోపాల్‌లో ఆవిష్కరించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం వెంకన్న, కార్యక్రమంలో నాయకులు, పంచాయతీ కార్మికులు సాయాగౌడ్, దండు గంగమల్లు, టి రాజన్న, శేఖర్, సురేష్, గంగన్న, రాములు, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

సిరికొండలో..

సిరికొండ: హైదరాబాద్‌లో ఈ నెల 20న టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీన సభ జరగనుందని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి రమేశ్ తెలిపారు. సభకు సంబంధించిన వాల్ పోస్టర్లను మండల కేంద్రంలో ఆవిష్కరించారు. నాయకులు రామకృష్ణ, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో భూముల కబ్జా

రోడ్డుపై అక్రమ నిర్మాణాలు

- ఏళ్ల తరబడిగా సాగుతున్న దందా
- అందిన కాడికి దండుకొని అమాయకులకు విక్రయిస్తున్న అక్రమార్కులు
- పట్టాల పేరుతో కాలయాపన
- తెలిసినా పట్టించుకోని అధికారులు



మొజాజ్ కాలనీ వెనుక భాగంలో అటవీశాఖ స్థలంలో నిర్మించిన ఇళ్లు

నిజామాబాద్‌నాగారం: నగరంలో ఖాళీ జాగ కనిపిస్తే కబ్జా.. లేదంటే అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. జిల్లా కేంద్రంలో ఏళ్ల తరబడిగా ప్రభుత్వ, అటవీ భూములు, రోడ్లు, పార్కులు, దేవాలయాల స్థలాలు సైతం కబ్జాకు గురవుతూనే ఉన్నాయి. ఇందులో భాగంగానే 12వ డివిజన్‌లోని వెంగల్‌రావుకాలనీ, పెయింటర్స్‌కాలనీ, డ్రైవర్స్ కాలనీ, ధర్మపురి, స్లాటర్‌హౌస్ తదితర ప్రాంతాల్లో ఉన్న కెనాల్స్, డ్రైనేజీలు, రోడ్లు, అటవీ భూముల్లో అక్రమ ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతోంది. స్థానికంగా ఉండే ప్రజాప్రతినిధుల సహకారం, అవినీతి అధికారుల ప్రోత్సాహంతోనే ఏళ్ల తరబడిగా దందా నడుస్తోంది. అక్రమార్కులు అందిన కాడికి దండుకొని అమాయకులకు నకిలీ పత్రాలు సృష్టించి విక్రయాలు చేపడుతున్నారు. ఇవన్నీ తెలిసినా సంబంధిత శాఖల అధికారులు తమకేమీ తెలియదన్నట్లు వ్యవహరిస్తున్నారు.



వెంగళ్‌రావు కాలనీలో..

వెంగళ్‌రావు కాలనీలో రోడ్డు మధ్యలో నిర్మించిన ఇల్లు

తెలిసినా మాకెందుకులే..

వివిధ శాఖలకు సంబంధించిన ప్రభుత్వ భూములు కబ్జా అవుతున్నా విషయం తెలిసినా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం నుంచి ప్రతి నెల జీతం తీసుకుంటున్నా, అక్రమ సంపాదనకు అలవాటు పడిన అధికారులు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఎవరైనా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే కాలయాపన, పైగా బెదిరింపులు చేయిస్తారు. ఆయా శాఖల్లో కొంతమంది అధికారులు అక్రమాలకు పాల్పడడంతో ఏళ్ల తరబడిగా ప్రభుత్వ భూములు, కెనాల్స్, రోడ్డులు, పార్కులు, అటవీభూములు, తదితర కబ్జా అవుతునే ఉన్నాయి. ఇకనైనా ప్రభుత్వం అక్రమార్కులపై చర్యలు తీసుకొని ప్రభుత్వ భూములు కాపాడాలని నగరవాసులు, స్థానికులు కోరుతున్నారు.

అమాయకులను మోసం చేస్తూ..

ఈ ప్రాంతంలో అటవీభూమి, గుట్టలు ఉన్నాయి. కొంతమంది చోటమోటా నాయకులు అటవీభూములను సైతం అమ్మేయడం గమనార్హం. ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాల నుంచి బతుకుదెరువు కోసం వచ్చిన పేదలకు ఈ భూములు అమ్మేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వారికి ఓటర్‌ఐడీ, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు సైతం అక్రమార్కులు డబ్బులు తీసుకొని ఇప్పించారని సమాచారం. అక్రమంగా సంపాదించడానికి అమాయకులను మోసం చేస్తూ మరీ అందిన కాడికి దండుకునే పనిలో నిమగ్నమయ్యారు. అటవీ భూములను కబ్జా చేయడం పరిపాటిగా మారిపోయింది.

40 ఫీట్ల రోడ్డు కబ్జా ఇలా..

నగరంలోని 12వ డివిజన్ ప్రాంతంలో వెంగల్ రావుకాలనీ, డ్రైవర్స్‌కాలనీ, పెయింటర్స్ కాలనీ తదితర ప్రాంతాల మధ్యలో నుంచి 40 ఫీట్ల రోడ్డుతో పాటు, పెద్ద ఎత్తున కెనాల్, డ్రైనేజీ వెళ్తుంది. డ్రైనేజీ నిర్మాణంలో బండాలు అడ్డురావడంతో పనులు ఆపేశారు. ఇంకేముంది అదును చూసి కొంతమంది అక్రమంగా ఇళ్లు, షెడ్ల నిర్మాణాలు చేపట్టారు. మున్సిపల్ నుంచి ఇంటి నంబర్లు, రెవెన్యూ నుంచి పట్టాలు, విద్యుత్‌శాఖనుంచి మీటర్లు, ఇరిగేషన్ శాఖ ఎన్‌వోసీ, ఇలా అన్ని వచ్చేశాయి. రోడ్డు, డ్రైనేజీ మధ్యలోనే ఆగిపోయింది. కొంతమంది ఇళ్లు నిర్మించుకుంటే, మరికొంతమంది షెడ్డు నిర్మించుకొని వ్యాపారం చేసుకుంటున్నారు. ఈ ప్రాంతంలో రోడ్డు, డ్రైనేజీ లేకుండా పోయింది.

త్వరలో సర్వే చేస్తాం

ఇటీవల 12వ డివిజన్‌లో కొందరు అటవీ, ప్రభుత్వ భూములు కబ్జా చేశారని ఫిర్యాదు రావడంతో పోలీస్, రెవెన్యూ, అటవీశాఖ ఇలా అందరం కలిసి పరిశీలించాం. అటవీ భూములను కబ్జా చేసినట్లు తెలిసింది. కబ్జా చేసిన వారికి నోటీసులు ఇస్తాం. ఈ భూముల విషయంలో జాయింట్ సర్వే చేయడానికి తహసీల్దార్‌కు లేఖ రాశాను. త్వరలోనే జాయింట్ సర్వే చేసి కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకుంటాం. అటవీ భూములు కబ్జా చేస్తే చర్యలు తప్పవు

– సంజయ్‌గౌడ్, నిజామాబాద్‌నార్త్ ఎఫ్ఆర్‌వో

మడిగెల్లోనే కూరగాయలు విక్రయించాలి

- నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి
- శ్రద్ధానంద్‌గంజ్ పరిశీలన



మార్కెట్‌ను పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్మన్

సుభాష్‌నగర్: నగరంలోని శ్రద్ధానంద్‌గంజ్‌లో కూరగాయల వ్యాపారులకు కేటాయించిన మడిగెల్లోనే కూరగాయలు విక్రయించాలని నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి సూచించారు. నగరంలోని శ్రద్ధానంద్ గంజ్‌లోగల కూరగాయల హోల్‌సేల్ మార్కెట్‌ను గురువారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మార్కెట్‌లో వ్యాపారులు మడిగెలు వదిలి రోడ్డుపై కూరగాయలు విక్రయిస్తుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రాఫిక్ నియమాలు పూర్తిగా విస్మరిస్తున్నారని, మడిగెలు వదిలి రోడ్డుపై కూరగాయలు విక్రయించడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నట్లు తనకు ఫిర్యాదులు అందాయన్నారు. ఇకపై మడిగెల్లోనే కూరగాయలు విక్రయించాలని, రోడ్డుపై విక్రయించినట్లు తన దృష్టికి వస్తే లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. మార్కెట్‌లో వాహనాల వల్ల వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారని, కూరగాయలు తీసుకొచ్చిన వాహనాలు బయటే ఉంచేలా చర్యలు తీసుకోవాలని సెక్రటరీ ఖాదర్‌ను ఆదేశించారు. మార్కెట్‌ను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను వ్యాపారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఏఎంసీ డైరెక్టర్లు నరేందర్, మల్లేశ్, హోల్‌సేల్ అసోసియేషన్ సభ్యులు, మార్కెట్ కమిటీ సిబ్బంది ఉన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



వివరాలు నమోదు చేసుకుంటున్న సిబ్బంది

డిచ్‌పల్లి: ప్రజలు తమ ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మండల ఆరోగ్య విస్తరణాధికారి వై శంకర్ సూచించారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ ఆదేశాల మేరకు గురువారం జాతీయ కీటక జనిత వ్యాధుల నిరోధక కార్యక్రమంలో భాగంగా డిచ్‌పల్లి మండలం నడిపల్లిలో జ్వర సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. నడిపల్లిలో ఒకరికి డెంగీ పాజిటివ్ నిర్ధారణ కావడంతో గ్రామాన్ని సందర్శించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీటి నిల్వ గల ప్రదేశాలను గుర్తించి స్థానిక గ్రామ కార్యదర్శికి నివేదించాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. డెంగీ కేసు నమోదైన గ్రామంలో కచ్చితంగా వైద్య శిబిరం ఏర్పాటు చేయాలన్నారు. దోమలను నిర్మూలించడానికి స్ప్రే చేయించాలని గ్రామ కార్యదర్శికి సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త సుజాత, ఎంఎల్‌హెచ్‌పీ రేణుక, పంచాయతీ కార్యదర్శి కిషన్‌రావు, కారోబార్ సంతోష్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు ఎస్ఆర్ భవన్‌లో రైతు సదస్సు

నిజామాబాద్ సిటీ: ఏఐకేఎంఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆర్ఆర్ భవన్‌లో శుక్రవారం 'వ్యవసాయ అనుబంధ రంగాలు, వాటి అభివృద్ధి' అనే అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు వేల్పూరు భూమయ్య పేర్కొన్నారు. వ్యవసాయరంగ సంక్షోభం, కేంద్ర, రాష్ట్ర పభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలు, కొత్త రైతు చట్టాలు, రైతులకు మద్దతు ధర వంటి పలు అంశాలు సదస్సులో చర్చించనున్నట్లు తెలిపారు. రైతులు, వ్యవసాయ కూలీలు, నాయకులు పాల్గొనాలని కోరారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సుభాష్‌నగర్: నగరంలో రెండు నెలలకొకసారి మరమ్మతుల కారణంగా 3వ శనివారం పలు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్-1, 2, 3 ఏడీఈలు చంద్రశేఖర్, ప్రసాద్‌రెడ్డి, వీరేశం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 132 కేవీఎస్ఎస్ నిజామాబాద్ సబ్‌స్టేషన్‌తోపాటు నగరంలోని పలు సబ్‌స్టేషన్లలో కూడా మరమ్మతులు చేపడుతున్నామని పేర్కొన్నారు. పవర్ హౌస్, తిలక్‌గార్డెన్, దుబ్బ, మిర్చి కాంపౌండ్, వినాయక్‌నగర్, బోర్గాం(పి), ముబారక్‌నగర్, అర్సాపల్లి, న్యూహౌసింగ్ బోర్డు, గూపన్‌పల్లి సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గ్రహించి సహకరించాలని కోరారు.

పట్టాభూముల సమస్యలను పరిష్కరించండి



వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

ధర్పల్లి: ప్రభుత్వం పేదలకు ఇచ్చిన పట్టా భూముల సమస్యలను వెంటనే పరిష్కరించి, వారికి న్యాయం చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు రామకృష్ణ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయం వద్ద భూపట్టాదారులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ మాలతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. మండలంలోని రామడుగు శివారులో గ్రామానికి చెందిన 200 మంది పేద కుటుంబాలకు 2005లో కాంగ్రెస్ ప్రభుత్వం సర్వే నంబర్ 1150లో పట్టాలు పంపిణీ చేసిందన్నారు. ప్రస్తుతం అటవీశాఖ అధికారులు సాగుకు సిద్ధమైన భూముల్లో పంటలు వేయకుండా అడ్డుపడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు జాయింట్ సర్వే చేపట్టి సమస్యను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం పట్టాలు జారీ చేసి కొన్నేళ్లు గడుస్తున్నా పట్టాదారులను ఫారెస్ట్ అధికారులు అడ్డుకోవడం సమంజసం కాదని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు కూలీబంధు ప్రకటించాలి



మాట్లాడుతున్న నాయకులు

నిజామాబాద్ సిటీ: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు కావస్తున్నా ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలు పూర్తిగా అమలు కావడం లేదని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట్రాములు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని నాందేవ్‌వాడలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. వ్యవసాయ కార్మికులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, కూలీలకు రూ. 12 వేల కూలీబంధు ఇవ్వాలన్నారు. రేషన్‌కార్డు లేనివారికి కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని, రూ. 4వేల పింఛన్ అమలుతోపాటు కొత్త పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బొర్ర సత్యనారాయణ, పెద్ది వెంకట్రాములు, గోశం లక్ష్మి, జి లక్ష్మణ్, ఎన్ గోవర్ధన్, చంద్రకాంత్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ నీటితో ఇబ్బందులు



పొలంలోకి వెళ్తున్న డ్రెయినేజీ నీరు

సిరికొండ: డ్రెయినేజీ కూలిపోవడంతో మురికి నీరంతా పొలంలోకి వచ్చి తీవ్ర ఇబ్బందికి గురవుతున్నామని బాధిత రైతు కుటుంబ ఆవేదన వ్యక్తం చేస్తోంది. వర్గన్ తండాకు చెందిన మీరీ అనే మహిళా రైతుకు తండా సమీపంలో పొలం ఉంది. తండాకు చెందిన మురికి నీరు వెళ్లడానికి వీరి పొలం పక్క నుంచి వాగు వరకు గతంలో డ్రెయినేజీ నిర్మించారు. డ్రెయినేజీ కూలిపోవడంతో మురికి నీరు పొలంలోకి వచ్చి చేరుతోంది. మురికి నీటితో పొలం వేసేటప్పుడు, కోత చేసేటప్పుడు కష్టాలు పడాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. పొలం కోత చేసే సమయంలో హార్వెస్టర్లు దిగబడుతున్నాయని, దీంతో చాలా ఇబ్బంది వస్తోందని మహిళా రైతు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై జీపీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ఆమె కోరుతున్నారు.

హిందూ సమాజాన్ని విచ్ఛిన్నం చేసే ప్రయత్నం..

- బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి



భజన చేస్తున్న పల్లె గంగారెడ్డి, ఇస్కాన్ బృందం

సుభాష్‌నగర్: దేశంలో కొందరు స్వార్థపరులు తమ స్వప్రయోజనాల కోసం హిందూ సమాజంలో అంటరానితనాన్ని తీసుకొచ్చి విచ్చిన్నం చేసే ప్రయత్నం చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి అన్నారు. గురువారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బీఆర్ శివప్రసాద్ ఆధ్వర్యంలో ఆది కవి వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పల్లె గంగారెడ్డి మాట్లాడుతూ.. దళిత సమాజానికి చెందిన వాల్మీకి మహర్షి రామాయణాన్ని రచించడం గొప్ప కార్యమని, సామాజిక సమరసత్వం సనాతన ధర్మంలో ఎప్పటి నుంచో ఉందని తెలిపారు. స్వార్థపరులు హిందూ సమాజాన్ని విచ్చిన్నం చేసే కుట్రలు చేస్తున్నారని, రాబోయే రోజుల్లో అసమానతలు లేని సమాజం కోసం బీజేపీ కృషి చేస్తుందన్నారు.

ఈ సందర్భంగా ఇస్కాన్ బృందం భజన కార్యక్రమాన్ని నిర్వహించింది. కార్యక్రమంలో నాయకులు కుమార్, బాలకృష్ణ, సంజీవ్, ముత్యం, దీపక్, కెప్టెన్ రాజు, ముక్తార్ సింగ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై అత్యాచారాలను అరికట్టాలి

నిజామాబాద్ సిటీ: ప్రపంచంలో మహిళలు అత్యున్నత శిఖరాలు అధిరోహిస్తున్న సమయంలో ప్రభుత్వాలు వారికి తగిన రక్షణ కల్పించడంలో విఫలమయ్యాయని, మహిళల గౌరవాన్ని కించపరిచేలా ప్రవర్తిస్తున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట్రాములు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో అఖిల భారత ప్రజాతంత్ర్య మహిళా సంఘం 4వ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. బిల్కిస్ బాను కేసులో నిందితులను విడుదల చేయడమే కాకుండా వారికి సన్మానాలు చేయడం మహిళలను అగౌరవపరచడమే అవుతుందన్నారు. గత మూడేళ్లుగా దేశంలో మహిళలపై జరుగుతున్న దాడులను, హత్యలు, అత్యాచారాలకు వ్యతిరేకంగా ఐద్వా పోరాటాలు చేస్తుందన్నారు. ఈ సమావేశంలో లావణ్య, రజియా, వనజ, హసీనా, సాయమ్మ, విజయలక్ష్మి, మాధవి, కళ, సంతోషిలతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పెద్ది వెంకట్రాములు, నూర్జహానా, సుజాత, అనిత తదితరులు పాల్గొన్నారు.

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	79,100	వెండి (కిలో)	96,000
22 క్యారెట్స్	72,980		

– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	32	50	గాజరుగడ్డ	50	80
బెండకాయ	30	50	పచ్చిమిర్చి	60	90
బీరకాయ	40	70	దోసకాయ	30	50
దొండకాయ	30	50	ఆలుగడ్డ	30	50
బీర్నీసుకాయ	60	90	గోబిగడ్డ	25	50
కాకరకాయ	40	80	గోబిపువ్వు	40	60
వంకాయ	40	60	బీట్‌రూట్	35	60
పాలకూర	50	80	కరివేపాకు	40	70
మెంతికూర	50	80	చామగడ్డ	40	70
కొత్తిమీర	50	80	గోరుచిక్కుడు	50	80
పుదీనా	60	90	చిక్కుడు	50	80
క్యాప్సికం	60	90			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

- స్క్రీన్-1: విశ్వం (తెలుగు) - 10.20, 1.20, 4.20 10.30, దేవర పార్ట్-1 (తెలుగు)- 7.25
- స్క్రీన్-2: కల్లుకంపౌండ్(తెలుగు)-10.40, జనక అయితే గనక(తెలుగు)-1.30, లవ్‌రెడ్డి (తెలుగు)-4.30, జిగ్రా(హిందీ)- 10.30
- స్క్రీన్-3: వేట్టయన్(తెలుగు)- 10.30 4.35 7.40 10.40, ఖడ్గం(తెలుగు)-1.40

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేను మాల్)

- స్క్రీన్-1: వేట్టయన్(తెలుగు)-, ది వైల్డ్ రోబోట్ (తెలుగు) - 1.40, 7.45, 10.15, దేవర పార్ట్-1(తెలుగు)- 4.10
- స్క్రీన్-2: ది వైల్డ్ రోబోట్(తెలుగు)-10.30, విశ్వం (తెలుగు) - 1.00 7.15, జనక అయితే గనక (తెలుగు)-4.15 10.30
- స్క్రీన్-3: ఇద్దరు (తెలుగు)-10.00, లవ్‌రెడ్డి (తెలుగు) - 1.00 7.30, వేట్టయన్ (తెలుగు) - 4.00, ఖడ్గం (తెలుగు) - 10.30
- స్క్రీన్-4: రివైన్డ్(తెలుగు)-10.25, వీక్షణం(తెలుగు) - 1.20, జిగ్రా(హిందీ) -4.00, వేట్టయన్(తెలుగు)-10.40

- లలితామహల్: దేవర పార్ట్-1(తెలుగు)
- దేవి: జనక అయితే గనక (తెలుగు)
- నటరాజ్: విశ్వం (తెలుగు)
- విజయ్: వేట్టయన్(తెలుగు)

సంక్షిప్తం

పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు సన్మానం



సిరికొండ: జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యుటర్‌గా నియమితులైన ధర్పల్లి రాజేశ్వర్ రెడ్డిని కాంగ్రెస్ మండల నాయకులు సన్మానించారు. జిల్లా కోర్టులో గురువారం పీపీని కలిసి శాలువాతో కప్పి సన్మానించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాకారం రవి, ఏఎంసీ డైరెక్టర్ రిక్క ముత్తెన్న, మల్లేశ్, ఉమ్మాజి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యావంతులను గెలిపించాలి



నిజామాబాద్‌నాగారం: పట్టభద్రుల ఎన్నికల్లో విద్యావంతులను ఎమ్మెల్సీగా గెలిపించాలని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ బండారి విజయ్‌కుమార్ అన్నారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి నాలుగు జిల్లాల్లో తిరుగుతూ ఓటు నమోదు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వతంత్రంగానే పోటీ చేస్తున్నానని ఒక్క అవకాశం ఇచ్చి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ జంగోల్ల నరేశ్ కుమార్, బి నిఖిల్, జి శేఖర్, సురేష్, వినీత్ పాల్గొన్నారు.

గ్రామ మంచినీటి సహాయకులకు శిక్షణ తరగతులు



జక్రాన్‌పల్లి: మండలంలోని అర్గుల్‌లో ఉన్న మిషన్ భగీరథ కార్యాలయంలో గురువారం గ్రామ మంచినీటి సహాయకులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి సీఈ రామచంద్రనాయక్ హాజరై మాట్లాడారు. గ్రామాల్లో మంచి నీటి సమస్య లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఈ గంగారాం, గ్రిడ్ డీఈ శివకుమార్, ఏఈలు నరేందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, చైర్మన్లు రొడ్డ సాయన్న, మారుతి, రాజు, రంజిత్, మధు, మంచినీటి సహాయకులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి



నిజామాబాద్ రూరల్: నగరంలోని ఇంద్రాపూర్‌కాలనీలో వాల్మీకి జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. నిర్వాహకులు జింజోట్ కిరణ్, బోత్ కిషన్ వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వాల్మీకి జయంతి ఉత్సవాలను గత 12 ఏళ్లుగా వాల్మీకి సమాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో బూత్ అంగుర్ సింగ్, బోత్ విజేందర్ సింగ్, బోత్ పవన్, బోత్ జోగిందర్, జేబీర్ కాగడ, నితిన్ సింగ్ దుల్గాజ్ రామ్ లాహోట్, విజయ్ సింగ్, బోత్ రమన్, బోత్ అజయ్ బేడ్ పాల్గొన్నారు.